క్లుప్తంగా

గాంధీనగర్‌ను పరిశీలించిన తహసీల్దార్


గాంధీనగర్‌లో పర్యటిస్తున్న తహసీల్దార్, అధికారులు

మణుగూరుటౌన్: ఒకవైపు రైల్వే ట్రాక్, మరోవైపు సింగరేణి బ్లాస్టింగ్‌లతో ఇబ్బంది పడుతున్న తమను మరో ప్రాంతానికి తరలించాలని గాంధీనగర్ వాసులు ఇటీవల కలెక్టర్‌కు విన్నవించడంతో.. ఆయన ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ అద్దంకి నరేశ్, ఎంపీడీఓ తెళ్లూరు శ్రీనివాసరావు, మున్సిపాలిటీ అధికారులు బుధవారం గాంధీనగర్‌లో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. ఆ వివరాలను కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మల్లికాంబ, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రాంగణంలో ప్లాంటేషన్


మొక్కలు నాటుతున్న ఎంఈఓ ఆనంద్‌కుమార్

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలంలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం పలు రకాల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మొక్కల వెంకటయ్య పాల్గొని అడవులు, చెట్ల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శంకర్ మహాదేవన్, ఉపాధ్యాయులు సునందారెడ్డి, రాజ్యలక్ష్మి, శాంతకుమారి, వసంత, సుశీల, బాబూరావు, జయరాం పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని జమ్మిగూడెం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ముందుగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత సెక్టార్ పరిధిలో ఉన్న గర్భిణులకు అంగన్‌వాడీ టీచర్ తులసీరత్నం ఆధ్వర్యంలో సీమంతాలు చేసి, వాయనాలు అందించారు. అలాగే చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేసి, పోషకాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాల్లో టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

భోజన ప్లేట్లు వితరణ


విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న సీఐ నాగరాజు రెడ్డి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నందిపాడు గ్రామంలోగల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు అశ్వారావుపేటకు చెందిన వాసవీక్లబ్ జోన్ చైర్‌పర్సన్ శీమకుర్తి సుబ్బారావు బుధవారం తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా 120 భోజన ప్లేట్లు, 120 గ్లాసులను వితరణగా అందించగా.. స్థానిక సీఐ పింగళి నాగరాజు చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో సీఐ మాట్లాడి వారి బోధన సామర్థ్యాలు, పాఠశాలల పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎస్.బాలయ్య, ఉపాధ్యాయుడు కృష్ణారావు, గ్రామస్తులు శీమకుర్తి ఉమా, కారం వీరాస్వామి పాల్గొన్నారు.

జూలై 9న దేశవ్యాప్త సమ్మె

భద్రాచలంఅర్బన్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిస్తూ.. జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ కోరారు. బుధవారం స్థానిక చంద్రరావు భవనంలో సీఐటీయూ పట్టణ నాయకులు కొలగాని రమేష్ అధ్యక్షతన జరిగిన సీఐటీయూ భద్రాచల పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సమ్మె జయప్రదానికి పారిశ్రామిక ప్రాంతాల్లో విస్తృతమైన ప్రచారం నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం పట్టణ అధ్యక్షుడు కె.బ్రహ్మచారి, జిల్లా కోశాధికారి జి.పద్మ, భద్రాచల పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

శిరోభారంగా విత్తనాల ఎంపిక

నకిలీలతో జరభద్రం!
- మార్కెట్‌లోకి వెల్లువలా కంపెనీలు
- అప్రమత్తంగా లేకపోతే అంతే..

మణుగూరురూరల్: వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో నకిలీ విత్తనాల బెడద ముంచుకొస్తోంది. అమాయక రైతన్నలే లక్ష్యంగా కొంతమంది కేటుగాళ్లు నకిలీ విత్తనాల రవాణా, విక్రయాలకు సిద్ధమవుతున్నారు. ఆ ఉచ్చులో పడకుండా రైతులను కాపాడేందుకు అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. అదే సమయంలో రైతన్నలకు నాణ్యమైన విత్తనాల గుర్తింపుపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

రైతులు బ్రాండెడ్, ధృవీకరించబడిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని, మాయమాటలకు మోసపోయి తక్కువ ధరలకు ఆకర్షితులు కావద్దని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఏటా ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో కొంతమంది నకిలీ కేటుగాళ్లు గుట్టుచప్పుడు కాకుండా విత్తనాల విక్రయాలకు పాల్పడుతున్నారు. నాసిరకం విత్తనాల కారణంగా రైతన్నలు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితులు నెలకొంటూ ఉన్నాయి.

వరి, పత్తి విత్తనాలే ఎక్కువ..

ప్రధానంగా మండలంలో వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి, కూరగాయల విత్తనాలను రైతులను ఎక్కువగా కొనుగోలు చేస్తుండగా.. వీటిలో నాసిరకం విత్త



నాలను కేటుగాళ్లు మార్కెట్‌లోకి తీసుకువచ్చి.. రైతులకు అంటగడుతున్నారు. ఈ విత్తనాలను వేసిన రైతులు చివరకు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

తనిఖీలు నామమాత్రమే..

నకిలీ విత్తనాలను అంతమొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ, సీడ్ కార్పొరేషన్‌శాఖలతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపడుతూ.. నకిలీ విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేస్తున్నాయి. అయితే ఈ తనిఖీలు నామమాత్రంగానే సాగుతున్నాయని.. పకడ్బందీ చర్యలేమి చేపట్టడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనిఖీల సమాచారాన్ని విత్తన డీలర్లకు కొంతమంది అధికారులు ముందుగానే అందిస్తున్నారన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నకిలీ విత్తనాల నుంచి కాపాడేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని మండల రైతులు కోరుతున్నారు.

నాణ్యమైన విత్తనం- రైతన్నకు నేస్తం
- రైతులకు మేలుజాతి విత్తనాలు
- నకిలీలకు చెక్ పెట్టడమే లక్ష్యం

కరకగూడెం: 'నాణ్యమైన విత్తనం– రైతన్నకు నేస్తం' అనే వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ సహకారంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం.. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది.

పరిశోధనా కేంద్రం నుంచి..

ఈ కార్యక్రమం ద్వారా నేరుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా కేంద్రాలలో ఉత్పత్తి చేయబడిన, అధిక నాణ్యత గల విత్తనాలను రైతులకు అందిస్తారు. దీనివల్ల నకిలీ విత్తనాలు, తక్కువ నాణ్యత గల విత్తనాల బెడద తగ్గుతుంది. తద్వారా ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుంది. విశ్వవిద్యాలయం నుంచి విత్తనాలను పొందడం ద్వారా వారి పెట్టుబడి వ్యయం కూడా తగ్గుతుంది.

శాస్త్రీయ విజ్ఞానం.. సాంకేతికత బదిలీ!

ఈ కార్యక్రమం కింద ఎంపిక చేయబడిన రైతులకు విత్తనోత్పత్తిపై శిక్షణ, అవగాహన కల్పిస్తారు. దీనివల్ల రైతులు తమ పొలాల్లోనే నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకుంటారు. విత్తన పంపిణీతో పాటు.. వివిధ పంటల


కరకగూడెం: రైతులకు విత్తనాలను అందజేస్తున్న అధికారులు (ఫైల్)

సాగుకు సంబంధించిన ఆధునిక మెలకువలు, శాస్త్రీయ పద్ధతులపై వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందిస్తారు. రాబోయే రెండు మూడు సంవత్సరాల్లో రైతులు తమ అవసరాలకు తగ్గ విత్తనాలను తామే ఉత్పత్తి చేసుకునేలా ప్రోత్సహించనున్నారు.

వ్యవసాయానికి కొత్త ఊపిరి..



వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడం, వారి కష్టాలను తగ్గించడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఆధునిక పద్ధతుల్లో ఉత్పత్తి చేసిన అసలు సిసలైన, అధిక దిగుబడినిచ్చే విత్తనాలను రైతులకు అందిస్తాం.

– చటర్జీ, ఏఓ, కరకగూడెం

గురుకులంలో ప్రవేశాలకు నేడు చివరి తేది..

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దోస్త్ మూడో విడత ఆన్‌లైన్ ప్రక్రియ ఈ నెల 19న ముగియనుంది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ బండారుపల్లి రవి బుధవారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. అర్హత కలిగిన ఇంటర్ పాసైన గిరిజన విద్యార్థులు డిగ్రీలో ప్రవేశాలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలలో సమర్పించాలని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

బూర్గంపాడు: సారపాక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సారపాక-1, సారపాక-2 ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల ఏర్పాటు కోసం గురువారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ ఉపేందర్ తెలిపారు. బుధవారం ఓ ప్రకటనలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉన్నందున ఆయా ప్రాంత ప్రజలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలంలోని ఎర్రగుంట పాఠశాల ప్రాంగణంలో బుధవారం క్రీడాపాఠశాలలకు ఎంపికల్లో భాగంగా పలు క్రీడల్లో పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలకు చెందిన 30 మంది 4వ తరగతి విద్యార్థులు ఎంపికల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ యు.ఆనంద్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు ఎల్.జయరాం, ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

భద్రాచలం సబ్‌జైలులో తనిఖీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో ఉన్న ఖైదీలకు అందిస్తున్న సేవలు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయ పరంగా ఏమైనా సహాయం కావాలంటే జిల్లా లీగల్ సర్వీసెస్ ద్వారా ఉచిత సేవలు పొందవచ్చని తెలిపారు. అనంతరం జైలు ఆవరణలో ఉన్న మరుగుదొడ్లు, వంటగదులు, స్టోర్‌రూం, ఖైదీల వసతి గృహాలను ఆయన పరిశీలించారు. తిరుగు ప్రయాణంలో బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న శిశు గృహాన్ని సందర్శించి అక్కడి చిన్నారులకు అందుతున్న వసతుల గురించి ఆరా తీశారు. ఈయన వెంట భద్రాచలం సబ్ జైల్ సూపరింటెండెంట్ ఉపేందర్, శిశు గృహం మేనేజర్ చంటిబాబు ఉన్నారు.



సబ్ జైలులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి


రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఏఓ బాబూరావు

గుండాల: ప్రతీ ఏటా భూసారం దిబ్బతినే రసాయనిక ఎరువులు, పురుగు మందులకు స్వస్తి పలికి సేంద్రీయ ఎరువులను వాడుతూ అధిక దిగుబడులను పొందవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ డీలర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో హనుమాన్ ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ నిర్వాహకులు మానాల వెంకటేశ్వర్లు, మానాల ప్రణీత్ కుమార్‌ల సౌజన్యంతో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ.. ప్రతి ఏటా మట్టి పరీక్షలు తప్పనిసరి చేయించుకోవాలని, యూరియాను అధిక మోతాదులో వాడకూడదని సూచించారు. మునగ, ఆయిల్ ఫాం, పప్పు దినుసులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పంటమార్పిడి, ప్రత్యమ్నాయ, అంతర్గత పంటలపై సూచనలు చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ, అగ్రికల్చర్ సైంటిస్ట్ శివ రైతులకు వ్యవసాయ మెలకువలు, రసాయనిక ఎరువుల వాడకం తగ్గింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం డ్రోన్ ద్వారా ఎరువుల పిచికారీని రైతులకు చూపించారు. కార్యక్రమంలో ఏడీఏ తాతారావు, అసోషియేషన్ డైరెక్టర్ ఉమా రెడ్డి, ఏఓ వెంకటరమణ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, డీలర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు, నార్ల సోమసుందర్, జనార్దన్‌రావు, భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముక్తి సత్యం, మాజీ సర్పంచ్ కోరం సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ


ఫౌండేషన్ తరపున నోట్ బుక్స్ అందజేస్తున్న ఎస్సై రాజ్‌కుమార్

పినపాక: మండల పరిధిలోని తొగ్గుడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం మాతృ అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు అందించగా.. ఎస్సై రాజ్ కుమార్ వాటిని పంపిణీ చేశారు. సుమారు 50 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్ వంటివి అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు సతీష్ చారి, సురేష్, పూనం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం


దుర్గారావును సత్కరిస్తున్న ఎస్సై పీవీఎన్ రావు, సిబ్బంది

కరకగూడెం: మండల పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వహించి ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయిన కానిస్టేబుల్ దుర్గారావును బుధవారం కరకగూడెం పోలీస్ స్టేషన్‌లో సన్మానించారు. స్థానిక ఎస్సై పీవీఎన్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఈ మేరకు శాలువాతో సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ ఎదుట బీఆర్ఎస్ ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణుగూరురూరల్: మండలంలోని నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తొలుతగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తుండగా.. విషయం తెలుసుకున్న మణుగూరు సీఐ పాటి నాగబాబు, ఎస్సై మేడ ప్రసాద్, ట్రైనీ ఎస్సై మనీషాలు ఆందోళనకు అనుమతులు లేవంటూ అడ్డుకున్నారు. శాంతియుతంగా ఆందోళన చేపడతామని చెప్పి.. తహసీల్దార్ కార్యాయం ఎదుట నాయకులు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన సుమారు రూ.150కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులను నేటి కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు నిలిపివేయడం విచారకరమన్నారు. వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రామారావుకు సమస్యలపై కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కుంటా లక్ష్మణ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వేర్పుల సురేష్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు అక్కి నర్సింహరావు, నాయకులు తాళ్లపల్లి యాదగిరిగౌడ్, సకిని బాబురావు, ఎడవల్లి వెంకటయ్య, కలగూర శంకర్, ప్రభుదాస్, పప్పుల ప్రసాద్, మేకల రవి, యువజన నాయకులు రవిప్రసాద్, గుర్రం సృజన్, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

దుమ్ముగూడెం: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గూనూరి రమణ కార్యకర్తలకు సూచించారు. బుధవారం దుమ్ముగూడెం గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు కంద్రపు త్రినాథ్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించగా.. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమణ మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోర్స కామరాజు, పవన్ కుమార్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు పరిశీలన


పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఏఈ, నాయకులు

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీలో రూ.60లక్షల వ్యయంతో చేపడుతున్న కోడిపుంజుల వాగు పూడికతీత పనులను ఐబీ ఏఈ సక్రు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు శివసైదులు, యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, నాయకులు మాదాడి రాజేష్, బల్లెం సురేష్, రహీం పాషా, పల్లం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తుల వెల్లువ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అనంతారం, పేరాయిగూడెం, గుర్రాల చెరువు గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కాగా, పేరాయిగూడెం సదస్సుకు స్థానిక తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ హాజరై, రైతుల వద్ద నుంచి భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. మూడు చోట్ల నిర్వహించిన సదస్సుల్లో మొత్తం 350 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ హుస్సేన్, ఆర్ఐలు కృష్ణ, పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలపై సీఎంకు వినతి


సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గ అభివృద్ధి పనులకు నిధులు, పలు సమస్యలపై బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కలిశారు. హైదరాబాద్‌లో సీఎంను ఆయన నివాసంలో కలిసిన ఎమ్మెల్యే.. పలు సమస్యలపై వినతిపత్రం అందజేయగా, సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఇంకుడు గుంతల పరిశీలన

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలంలోని తొట్టిపంపు, అన్నపురెడ్డిపల్లి, పెంట్లం, నరసాపురం, గుంపెన, అబ్బుగూడెం పంచాయతీల్లో సెంట్రల్ వాటర్ కమిషన్ సబ్‌డివిజనల్ ఇంజినీర్ పృథ్వీరాజ్ బుధవారం పర్యటించి.. ఇంకుడు గుంతలను పరిశీలించారు. భూగర్భజలాలు పెంచేందుకే ఇంకుడు గుంటలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ దిశగా ప్రతి ఒక్కరినీ చైతన్యవంతం చేయాలని మండల అధికారులకు ఆయన సూచించారు. ఎంపీడీఓ కావూరి మహాలక్ష్మి, రాజు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


ఇంకుడు గుంతల నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఈ పృథ్వీరాజ్

వాహనదారులు నిబంధనలు పాటించాలి

పినపాక: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. ఈ మేరకు బుధవారం బయ్యారం క్రాస్ రోడ్‌లో ఆటో డ్రైవర్లు, వాహనదారులతో మాట్లాడారు. ప్రతి ఒక్క వాహనదారుడు ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు ఆటోలో ప్రయాణిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మహిళల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వారిని గౌరవించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


ఆటో డ్రైవర్లు, వాహనదారులకు సూచనలు ఇస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



బూర్గంపాడు: సభలో మాట్లాడుతున్న సాబీర్‌పాషా

బూర్గంపాడు: పార్టీ శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సారపాకలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన పార్టీ 18వ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఐ పోరాటాలు, ఉద్యమాలను ప్రజలకు వివరిస్తూ.. పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొల్లోజు అయోధ్య, సారెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, ముద్వ వెంకటేశ్వరరావు, అలవాల సీతారాంరెడ్డి, నాగేశ్వరరావు, సుబ్బారెడ్డి, బర్ల వెంకటేశ్వర్లు, బాలకృష్ణ పాల్గొన్నారు.

గెలుపునకు కృషి చేయాలి..

అశ్వారావుపేట: అశ్వారావుపేట మున్సిపాలిటీకి మొదటి సారి జరుగనున్న ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం పిలుపునిచ్చారు. బుధవారం సీపీఐ అశ్వారావుపేట పట్టణ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వీలయినన్ని స్థానాల్లో పార్టీ అభ్యర్థులు పోటీ చేయాలని.. పోటీ చేసిన అభ్యర్థుల గెలుపు దిశగా సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు గన్నిన రామకృష్ణ, వగ్గెల అర్జునరావు, నూకవరపు విజయ్‌కాంత్, పఠాన్ జలాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

దుమ్ముగూడెం: పర్ణశాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని గౌరారం, పైడాకులమడుగు గ్రామాల్లో వైద్యాధికారి డాక్టర్ రేణుకారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు, పాటించాల్సిన వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను ఆమె వివరించారు. ఈ శిబిరంలో వైద్యసిబ్బంది వెంకట నర్సమ్మ, అమ్మాజీ, నాగేశ్వరరావు, పార్వతి, శిరీష ఆశావర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండల పరిధిలోని బుగ్గ గ్రామపంచాయతీలో ఉన్న వలస ఆదివాసీ గిరిజన గ్రామం ఖమ్మంతోగులో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సునీల్ గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాభారతి, వైద్యసిబ్బంది రాంప్రసాద్, కౌసల్య, శ్రీకాంత్, శాంత పాల్గొన్నారు.

కాలినడకన వెళ్లి..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలోని గుట్టపై ఉన్న పెద్దమిద్దె గ్రామానికి వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్ మూడు కిలో మీటర్ల మేర కాలినడకన వెళ్లి ఇంటింటికి తిరిగి పరిసరాలను పరిశీలించారు. మొద్దులమడ గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి, రక్త నమూనాలను సేకరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో తొలి విడత దోమల నివారణ మందు స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు, ఎంటీఎస్ విజయ్ రెడ్డి, సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


అశ్వారావుపేటరూరల్: పెద్దమిద్దె గ్రామంలో పరిసరాలను పరిశీలిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది


దుమ్ముగూడెం: వ్యాధి బాధితులను పరీక్షిస్తున్న డాక్టర్ రేణుకారెడ్డి